క్లుప్తంగా

విమాన కలశ పునఃప్రతిష్ఠ రేపు

అద్దంకి: బాపట్ల జిల్లా అద్దంకి మండలం సింగరకొండపై వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానంలో గురువారం విమాన కలశ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉదయం 11:45 నిమిషాలకు నిర్వహించనున్నట్లు ఈవో మంగళవారం తెలిపారు. మంగళవారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించారు. బుధవారం విమాన కలశమునకు వాస్తు శుద్ధి, అధి వాస హోమాలు, 14 న విమాన కలశ ప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

మణికేశ్వరంలో అన్నదానం



చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అద్దంకి: వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి తండ్రి, మాజీ గ్రామ సర్పంచ్, మల్లీశ్వర స్వామి దేవస్థానం మాజీ అధ్యక్షుడు ఈదా అంజిరెడ్డి 16వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా ఆయన కుమారుడు ఈదా శ్రీనివాసరెడ్డి గ్రామంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అంజిరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమా శ్రీనివాసరెడ్డి, గ్రామంలోని నాయకులున్నారు.

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీ

చీరాల అర్బన్: చీరాల డివిజన్ విద్యుత్ శాఖ సిబ్బంది విజిలెన్స్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ సర్వీసులను తనిఖీ చేపట్టారు. సిబ్బంది మొత్తం 34 టీంలుగా ఏర్పడి చీరాల పట్టణంలో తనిఖీ నిర్వహించారు. మొత్తం 2661 సర్వీసులను తనిఖీ చేసి కేసులు నమోదు చేసి రూ. 4,24,600 జరిమానా విధించారు. విజిలెన్స్ ఈఈ ఎం. భాస్కరరావు, డీఈఈ విజయ్ శ్రీనివాస్, ఆపరేషన్ విభాగం చీరాల డీఈఈ బీ హరిప్రసాదరావు, పర్చూరు డీఈఈ ఐ. శ్రీనివాసులు, వేటపాలెం డీఈఈ ని, శ్రీనివాసరావు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.

చీమకుట్టినట్లయినా లేదా!



చెత్త కుప్పలు, వ్యర్థాలతో నిండిపోయిన యంత్ర పరికరాలు



చెత్తకుప్పలో వర్షపాతం కొలిచే పరికరం

- అపరిశుభ్రతకు నిలయాలుగా ప్రభుత్వ కార్యాలయాలు
- స్వచ్ఛ భారత్ నినాదం కాగితాలకే పరిమితం
- అసహనం వ్యక్తం చేస్తున్న పౌరులు

చీరాల టౌన్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఊదరగొట్టే అధికారులు.. తమ కార్యాలయాలను మాత్రం అపరిశుభ్రతకు నెలవుగా ఉంచుకుంటున్నారు. చీరాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో చెత్తకుప్పలు ధాటికి దుర్గంధం వ్యాపిస్తోంది. ఫలితంగా పలు పనుల నిమిత్తం కార్యాలయాలకు వస్తున్న ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. కనీసం కార్యాలయాల ఆవరణలో ఉన్న చెత్తకుప్పలను తొలగించి బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. చీరాల రెవెన్యూ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, హౌసింగ్ కార్యాలయాల పరిసరాలు ఇలా అధ్వానంగా మారాయి. చుట్టూ వ్యాపించిన చెత్తను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. అలాగే మురుగు నీరు, నిరుపయోగంగా ఉన్న వస్తువులతో అపరిశుభ్ర వాతావరణం వ్యాపించింది. ఎంపీడీవో కార్యాలయం వెనుక చిల్లచెట్లు, చెత్తకుప్పలు పెరిగిపోవడంతో కీటకాల తాకిడిగా ఎక్కువగా ఉందని కార్యాలయాలకు వచ్చే ప్రజలు చెబుతున్నారు. చెత్తకుప్పల నుంచి వెదజల్లే దుర్గంధంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై ర్యాలీలు, మానవ హారాలు, సభలు పెట్టడమే కానీ ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయడంలేదు.

ప్రజాస్వామ్యం ఖూనీ

- ముక్తేశ్వరంలో గ్రామ బూత్ కమిటీల ఎంపికలో పాల్గొన్న మండల కన్వీనర్ కృష్ణబాబు



గ్రామ, బూత్ కమిటీల ఎంపికలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ కృష్ణబాబు

బల్లికురవ: ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో రాష్ట్రంలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు జరుగుతున్న ఉప ఎన్నికల్లో ఓడిపోతానే భయంతోనే కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ధ్వజమెత్తారు. మంగళవారం రాత్రి ముక్తేశ్వరంలో గ్రామ, బూత్ కమిటీల ఎంపిక చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేయకుండా రెడ్ బుక్ రాజ్యాంగంతో పోలీసులను అడ్డుపెట్టుకుని విధ్వంసాలు సృష్టిస్తున్నారన్నారు. బాధ్యతగా పనిచేయాల్సిన పోలీసులు కూటమి ప్రభుత్వానికి తొత్తులు గ్యావహరిస్తూ మహిళలపై దౌర్జన్యాలకు పాల్పడుతూ దొంగ ఓట్లు వేసుకునేందుకు ప్రోత్సహించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రజలు ఇదంతా గమనిస్తునే ఉన్నారని.. దాడులు, హింసా రాజకీయాలు ఎంతో కాలం కొనసాగవని ధ్వజమెత్తారు. ముక్తేశ్వరం గ్రామ కమిటీ అధ్యక్షుడుగా మట్టిముక్కల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడుగా చెన్నూరి సాంబశివరావు, నాలుగు బూత్ కమిటీలకు అధ్యక్షులుగా రావూరి రామాంజనేయులు, బూసా వెంకటేశ్వర్లు, నాగండ్ల వెంకటరావు, కారసాని శివారెడ్డిలను ఎంపిక చేశారు. మాజీ సర్పంచ్ కొణుదుల శంకరరెడ్డి, చంటి పుల్లారెడ్డి, చెన్నూరి సురేష్ పాల్గొన్నారు.

బూచేపల్లితో బ్రహ్మానందరెడ్డి భేటీ



బూచేపల్లిని కలిసిన బ్రహ్మానందరెడ్డి

చినగంజాం: దర్శి శాసన సభ్యుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దర్శిలోని ఆయన నివాస గృహానికి వెళ్లిన ఆయన ప్రస్తుత రాజకీయ స్థితిగతులపై కొద్దిసేపు మాట్లాడారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని బ్రహ్మానందరెడ్డికి బూచేపల్లి సూచించారు. ఆయన వెంట బీసీ నాయకులు వీవీ రాంప్రసాద్, నాయకులు కె.బురఖాయలరెడ్డి, ఆసోది నారపరెడ్డి, కె.వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల హామీలు నెరవేర్చండి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐసీటీయూ బల్లికురవ అధ్యక్షుడు నిమ్మల అప్పయ్య అన్నారు. మంగళవారం ఆటోడ్రైవర్లకు, మోటారు కార్మికులకు వాహన మిత్ర అందజేయాలని కోరుతూ తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మల అప్పయ్య మాట్లాడుతూ ఈనెల 15 నుంచి కూటమి ప్రభుత్వం అమలు చేయబోతున్న ఉచిత బస్సుకు తాము వ్యతిరేకం కాదని.. అయితే ఆటోడ్రైవరర్లు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ఆటోడ్రైవర్లను ఆదుకునేందుకు వాహన మిత్ర పథకంతో రూ.15 వేలు అందజేయాలన్నారు. ఆటో , మోటారు వాహనాలపై ఉన్న పాతపోలీస్ రవాణా ఇ- చలనా రద్దు చేయాలన్నారు. డ్రైవర్లకు వ్యక్తిగత, ప్రమాద బీమా పాలసీ రూ. 10 లక్షలు అమలు చేయాలన్నారు. ఆటో డ్రైవర్లపై పోలీసులు రాస్తున్న అక్రమ కేసులు రద్దు చేయాలన్నారు. ఏఐసీటీయూ బల్లికురవ ఆటోవర్కర్స్ కార్యదర్శి కందుల మరియబాబు, కోశాధికారి కందుకూరు రామారావు, సెక్రటరీ మరియబాబు, యూనియన్ ప్రెసిడెంట్ వడ్లమూడి యేసు, వైస్ ప్రెసిడెంట్ జంద్రాజుపల్లి అజయ్ పాల్గొన్నారు.

నమ్మి ఓట్లేస్తే నిలువునా ముంచారు



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మధుసూదన రెడ్డి

కారంచేడు: అమలుకు సాధ్యం కాని హామీలను నమ్మి ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలను చంద్రబాబు ప్రభుత్వం నిలువునా ముంచేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూధన రెడ్డి ఆరోపించారు. మంగళవారం కారంచేడులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ జువ్వా శివరాంప్రసాద్ అధ్యక్షతన ×బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ¥ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ప్రజలను మోసం చేసేందుకు అమలుకు సాధ్యం కాని ఎన్నో హామీలను ఇచ్చారన్నారు. వారి మోసపు మాటలు, వాగ్దానాలు ప్రజలు నమ్మడంతో అధికారాన్ని చేజిక్కించుకున్నారన్నారు. మోసపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తన ఇష్టానుసారం పాలన సాగిస్తూ ప్రజలను విస్మరించారన్నారు. సంపద సృష్టించి ప్రజలకు పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు, ఆయన కొడుకు లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు తమ సొంతానికి సంపదను సృష్టించుకుంటున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా సరైన తీరులో నెరవేర్చలేక అబద్ధపు ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. నేటి టీడీపీ పాలనలో ఇబ్బందులు పడే ప్రతి ఒక్కరికీ ధైర్యం చెప్పేలా కృషి చేస్తున్నామన్నారు. వారందరికీ రానున్న మన ప్రభుత్వ పాలనలో అంతా మంచే జరిగేలా మన జగనన్న సుపరిపాలను బాటలు వేస్తున్నారని తెలిపారు. జగనన్న పాలనలో మంచి రోజులు రాబోతున్నాయని, మళ్ళీ ప్రజలకు అవసరమైన అన్ని రకాల పథకాలు మీ ఇంటి ముంగిటకు చేరుతాయన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరికీ సంక్షేమ పథకాలు రానున్నాయని ఆయన హామీ ఇచ్చారు. పర్చూరు నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జువ్వా కోమలి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండా చౌదరిబాబు, చల్లా సుబ్బారెడ్డి, కొడాలి ధర్మానందరావు, యార్లగడ్డ శ్రీకాంత్, ముల్లా నూర్‌అహ్మద్, యార్లగడ్డ పాపారావు, బట్టు అనీల్‌కుమార్, కారుమూడి సుబ్బారెడ్డి, బండారు ప్రభాకరరావు, కఠారి అప్పారావు, కొల్లా శేషగిరావు, ముప్పాళ్ల రాఘవయ్య, కొల్లా శ్రీహరి, ఉప్పలపాటి అనీల్, హరిబాబు పాల్గొన్నారు.

దేవికపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయండి

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య



డీఎస్పీ మొయిన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చీరాల రూరల్: కారంచేడు గ్రామంలోని రజక కులస్తురాలు.. దివ్యాంగురాలైన పాదిలి దేవికపై అమానుషంగా దాడిచేసిన యార్లగడ్డ శ్రీకృష్ణ అతని భార్యపై 2016 దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 92 యాక్ట్ ప్రకారం కేసులు నమోదుచేసి శిక్షించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం బాపట్ల జిల్లా అధ్యక్షుడు, సంచార జాతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లా రామయ్య పేర్కొన్నారు. మంగళవారం చల్లా రామయ్యతో పాటు సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల చిట్టిబాబు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పేరాల జనార్దన్ కలిసి డీఎస్పీ పి. మహ్మద్ మొయిన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూగ, చెవుడుతో బాధపడుతున్న దేవికపై అకారణంగా యార్లగడ్డ శ్రీకృష్ణ అతని భార్య కలిసి.. తలపై ఇనుపరాడ్డుతో దాడిచేసి గాయపరిచారని చెప్పారు. గాయాలపాలైన బాధితురాలిని ఇప్పటికి ఐదురోజులుగా చీరాల ప్రభుత్వాసుపత్రిలో ఉంచి చికిత్స చేయిస్తున్నారని చెప్పారు. తక్షణమే డీఎస్పీ స్పందించి దివ్యాంగుల హక్కుల చట్టం కిందకేసు నమోదు చేసి వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ వారిరువురిపై దివ్యాంగుల హక్కుల చట్టం కింద కేసు నమోదు చేసేందుకు హామీ ఇచ్చారని వారు తెలిపారు.

బాధితురాలిని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు..

గాయాలపాలై చీరాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగురాలు దేవికను మంగళవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) నాయకులు పరామర్శించారు. సంఘటనకు సంబంధించి బాధిరాలి తల్లివద్ద వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, పద్మశ్రీ మందా కృష్ణ నాయకత్వంలో బాధితురాలికి న్యాయం జరిగేంతవరకు వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులతో కలిసి పోరాడుతామని పేర్కొన్నారు. సంఘటన జరిగి ఐదురోజులైనా ఇంతవరకు పోలీసులు స్పందించకపోవడం పోలీసుల అలసత్వంగా భావిస్తున్నామని చెప్పారు. తక్షణమే నిందితులను అరెస్టుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడతల అభిషేక్, చుండూరు రమేష్, వీరమల్లు కోటేశ్వరరావు, పిక్కి శ్రీనివాసరెడ్డి, ఆదిశేషు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు మండలాన్ని ప్రకాశంలో కలపాలి

మార్టూరు: జాతీయ రహదారికి ఇరువైపులా వ్యాపించి ఉన్న మార్టూరు మండలాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలని మార్టూరు మండల ప్రాంతీయ అభివృద్ధి మండలి వేదిక మంగళవారం డిమాండ్ చేసింది. నూతన జిల్లాల ఏర్పాటు మండలాల సర్దుబాట్ల కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసిన నేపథ్యంలో వారు మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ప్రస్తుత జిల్లా కేంద్రం బాపట్ల మార్టూరుకు 70 కిలోమీటర్ల దూరంలో ఉండి రాకపోకలకు సరైన రోడ్డు మార్గం లేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజలు రెవెన్యూ, పోలీసు తదితర సమస్యల కోసం బాపట్ల వెళ్లి రావటం ఎంతో వ్యయ ప్రయాసలతో కూడి ఉందన్నారు. నూతన జిల్లాల ఏర్పాటు సర్దుబాట్లలో భాగంగా అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్న నేపథ్యంలో మార్టూరు మండల ప్రజల సమస్యను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అద్దంకి నియోజకవర్గానికి అనుకొని ఉన్న మార్టూరు మండలం జాతీయ రహదారికి ఇరువైపులా వ్యాపించి ఉండటంతో పాటు ప్రజలు పూర్వపు ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలు వెళ్లి రావడానికి అలవాటు పడి ఉండటంతో పాటు రవాణా సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మార్టూరు ప్రాంతీయ అభివృద్ధి మండలి వేదిక తరపున పార్టీలకు అతీతంగా త్వరలో మంత్రివర్గ ఉపసంఘాన్ని కలిసి తమ సమస్యను వివరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బత్తుల హనుమంతరావు, ఎన్నిక పాటి రాంబాబు, బి.సూరిబాబు, కృష్ణమూర్తి, సాంబయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో 456వ రక్తదానం

అద్దంకి రూరల్: రక్త హీనతతో బాధ పడుతున్న శింగరకొండ నివాసి గర్భిణులు మల్లవరపు భవానికి అత్యవసరంగా బి- పాజిటివ్ రక్తం ఎక్కించవలసిందిగా వైద్యులు సూచించారు. వారి కుటుంబ సభ్యులు రోటరీ బ్లడ్ బ్యాంక్ డైరెక్టర్ చుండూరి మరళీ సుధాకరావును సంప్రదించగా నాగులపాడుకు చెందిన వేముల జయరాంను ప్రోత్సహించి రక్తదానం చేయించారు.

స్కూటీ బోల్తా.. ఒకరికి గాయాలు



గాయపడిన మహిళను వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: మూడు చక్రాల స్కూటీ బోల్తా పడటంతో ఓ మహిళకు గాయాలు అయిన సంఘటన పి.గుడిపాడు జాతీయరహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. కస్యాపురం కాలనీకి చెందిన అరుణకుమారి మేదరమెట్లకు మూడు చక్రాల స్కూటీపై వెళుతోంది. పి.గుడిపాడు క్రాస్ వద్దకు రాగానే స్కూటీ స్పీడు కంట్రోల్ కాకపోవడంతో బోల్తాపడింది. దీంతో అరుణకుమారి ముఖంపై, శరీరంపై గాయాలు కాగా హైవే అంబులేన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మేదరమెట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.